# ఆవినీతికథ

"మాస్టారూ! నేను మీ ఆవిణ్ణి పెళ్ళి చేసుకుంటాను!"-అన్నాడు రాజారావ్-కృష్ణమూర్తితో.

○ ○ ○ ○

కృష్ణమూర్తిని పగటిపూట చూస్తే పెద్దవాళ్ళు కూడ జడుసుకుంటారు.

పొడుగాటి స్థంభానికి తారు పూసి రెండు చింత నిక్కాలు కళ్ళుగానూ, చీకేసిన తాటిగింజ పీచుకి రాగి రంగేసి జుట్టుగానూ అమర్చి, కోటూ పాంటూ తొడిగితే-ఆస్థంభం పేరు- డాక్టర్ కృష్ణమూర్తి!

డాక్టర్ కృష్ణమూర్తి మందులిచ్చే డాక్టర్ కాడు. ఇంగ్లీషు లిటరేచర్‌లో డాక్టరేట్ పుచ్చుకొని కాలేజీ పిల్లలకి పాఠాలు చెప్పే లెక్చరర్!

కృష్ణమూర్తి మొదటిసారి క్లాసుకొచ్చిన రోజున చూసి స్టూడెంట్లంతా జడుసుకున్నాడు. అతను చెప్పిన మొదటి పాఠం విని మరీ జడుసుకున్నారు.

"ఈ లోకంలో ఎవర్నయినా నమ్మొచ్చు; దేన్నయినా నమ్మొచ్చు; కాని ఆడదాన్ని నమ్మకూడదు. చెట్టునీ, పిట్టనీ, పుట్టనీ, గుట్టనీ, కొండనీ, వాగునీ, మండే నిప్పునీ నిలువునా ముంచే నీటినీ, పుట్టలో దాగిన పామునీ, పొదలో పొంచిన పెద్దపులినీ, ఆకలిగొన్న సింహాన్నీ, అదుపు తప్పిన మదపుటేనుగునీ, పిచ్చెత్తిన కుక్కనీ, పొగరెక్కిన పోట్లగిత్తనీ- దేన్నయినా నమ్మొచ్చు కాని, ఆడదాన్ని మటుకు నమ్మకూడదు. ఈ సృష్టిలో వున్న అనంతకోటి జీవరాశినీ నమ్మొచ్చు. అణువుని నమ్మొచ్చు అణ్వాస్త్రాన్ని నమ్మొచ్చు. కాని-ఆడదాన్ని మటుకు నమ్మకూడదు.

కాలేజీకొచ్చిన మొదటిరోజున, బియ్యే సెకండియర్ క్లాసులో 'మాక్బెత్' నాటకం గురించి చెప్పిన మొదటి పాఠంలో 'లేడీ మాక్బెత్' పాత్రకి ఉపోద్ఘాతంగా కృష్ణమూర్తి యిచ్చిన ఉపన్యాసమిది.

○ ○ ○

రాజారావ్‌ని ఆడపిల్లలు కన్నార్పకుండా చూస్తారు. మగపిల్లలు అసూయతో కన్నెర్రజేసి చూస్తారు. అతడు ఆరడుగుల అందగాడు అల్లరిలో, ఆటపాటల్లో. ఆఖరికి చదువులో కూడ క్లాసందరికీ ముందువాడు.

ముందు బెంచీలో కూర్చునే రాజారావ్ చాలాసార్లు కృష్ణమూర్తి ముందరికాళ్ళకి బంధాలు వేశాడు. కృష్ణమూర్తి భయంకర రూపానికి అతని అనర్గళ వాగ్ధాటికి భయపడక

నిల్చినవాడూ, పిలిచి మాట్లాడినవాడూ క్లాసందరిలోనూ రాజారావ్ ఒక్కడే చాలాసార్లు ఇద్దరికి క్లాసులో వాదోపవాదాలు జరిగాయి. అవకాశం వచ్చినప్పుడల్లా కృష్ణమూర్తి ఆడవాళ్ళని తిట్టేవాడు కృష్ణమూర్తి ఆ ప్రస్తావన తెచ్చినప్పుడల్లా రాజారావ్ లేచి నిలబడి అడ్డు ప్రశ్నలు వేసేవాడు.

కృష్ణమూర్తి రూపం అతనికున్న కొన్ని అభిప్రాయాలు అందరికీ వెగటైనా, లెక్చరర్ గా అతనికున్న సరకూ సత్తా అందర్నీ ఆకట్టుకున్నాయి.

క్లాసులో పాఠం ఎంత కమ్మగా చెపుతాడో, క్రమశిక్షణ విషయంలో అంత కఠినంగానూ వుంటాడు. రాజారావు ఒక్కణ్ణి మాత్రం కృష్ణమూర్తి ఏం చెయ్యలేక పోయాడు. చెయ్యలేక కాదు- అల్లరిలోనే కాక, చదువులో కూడ రాజారావ్ కి అంతకిమించిన తెలివితేటలున్నాయని అతను గ్రహించాడు రాజారావ్ లో వున్న తెలివితేటలూ, చురుకుదనమూ కృష్ణమూర్తిని ఆకర్షిస్తే- లెక్చరర్ గా కృష్ణమూర్తికున్న శక్తిసామర్థ్యాలు రాజారావ్ ని ఆకర్షించాయి. పరస్పరమైన ఈ ఆకర్షణ వాళ్ళిద్దరి మధ్యా లెక్చరర్-స్టూడెంట్ సంబంధానికి మించిన సాన్నిహిత్యానికీ స్నేహానికీ దారితీసింది.

క్లాసు బయటకూడా ఇద్దరు తరుచుగా కలుసుకునేవారు. మాట్లాడుకునేవారు. సాహిత్యంగురించి ముఖ్యంగా

ఇంగ్లీషు సాహిత్యం గురించి చెప్పినమాట చెప్పకుండా గంటలతరబడి మాట్లాడేవాడు కృష్ణమూర్తి లిటరేచర్ స్టూడెంట్ గానే కాక, సహజంగా సాహిత్యమంటే ఆసక్తి వున్న రాజారావ్ శ్రద్ధగా వినేవాడు.

ఆడవాళ్ళగురించి కృష్ణమూర్తి యిచ్చే ఉపదేశాలు మాత్రం రాజారావు వినలేకపోయేవాడు చాలాసార్లు కృష్ణమూర్తి అభిప్రాయాల్ని తీవ్రంగా ఖండించాడు. ఆ విషయంలో మాత్రం తనుతప్ప ప్రపంచంలో అందరూ మూర్ఖులేనని కృష్ణమూర్తి వుద్దేశ్యం.

"చూడు రాజారావ్! మనిషి పుట్టినప్పట్నుంచీ ఇప్పటిదాకా జరిగిన జరుగుతున్న అన్ని అనర్థాలకి ఘాతుకాలకి ఘోరాలకీ రెండేమూలకారణాలు - ఆస్తి, ఆడదీనూ ఈ రెంటిలోనూ మళ్ళీ మొదటి కారణం ఆడదే.

డబ్బుకోసం, ఆస్తికోసం ఆశపడి, ఆరాటపడి వ్యామోహం పెంచుకొని, అందుకోసం నానా తిప్పలూ పడి తోటివాడితో పోటీపడి, పోట్లాడి, మోసాలుచేసి యింకా చెయ్యరాని పనులు చాలా చేస్తాడు మనిషి. కాని ఎన్నిచేసినా, డబ్బు సంపాదించగలిగిన మనిషి ఎంతో కొంత ఎన్నాళ్ళో కొన్నాళ్ళు సుఖపడుతాడు. బాగుపడుతాడు. కాని - ఆడదాని పిచ్చిలో పడ్డవాడు, ఆడదాన్ని నమ్మిన వాడుమటుకు చస్తే సుఖపడలేడు, బాగుపడలేడు. ఆడది నిప్పులాటిది. కావాలని కోరుకుంటే కనబడకుండా కాల్చే

స్తుంది. పురాణాలు చూడు; చరిత్రలు చూడు, ఇప్పటి ప్రపంచం చూడు - ఎక్కడ ఏ హత్య జరిగినా, అత్యాచారం జరిగినా, దోపిడీలు జరిగినా, యుద్ధాలు జరిగినా- అందుకు ప్రత్యక్షంగానో పరోక్షంగానో కారణం ఆడదే అయి వుంటుంది!"—అని రాజారావుకి హితోపదేశం చేశాడొకనాడు. రాజారావుకి వొళ్ళు మండింది "ఇన్ని కబుర్లు చెబుతున్నారుకదా, మరి మీరు పెళ్ళెందుకు చేసుకున్నారు మాస్టారు?" అని అడిగాడు.

కృష్ణమూర్తి మహాప్రవక్తలా ఒక చిరునవ్వు నవ్వి- "మగాడికి భౌతికంగా వుండే కొన్ని అవసరాలు తీర్చడానికి ఆడది కావాలి. నమ్మకూడదన్నానేగాని, అసలు ఆడదాని అవసరమే లేదని నేననలేదు"-అన్నాడు.

రాజారావు వెంటనే యింకేమీ అనలేకపోయాడు.

○ ○ ○

రాజారావు సెకండియర్ పాసై, ఫైనలియరులో కొచ్చేసరికి కృష్ణమూర్తితో అతనికున్న పరిచయం మరింత పెరిగింది.

కృష్ణమూర్తి ఒకనాడు రాజారావ్‌ని తనింటికి తీసుకెళ్ళాడు. ఇల్లు చూపించాడు తన పుస్తకాలన్నీ చూపించాడు.

"మాస్టారి పెళ్ళాం ఎలా వుంటుందో చూస్తే బావుణ్ణు" - అనుకున్నాడు రాజారావ్. కాని కృష్ణమూర్తి చూపించలేదు. పుస్తకాలు కొన్ని చదువుకోమని ఇచ్చాడు. పనిమనిషిచేత కాఫీ తెప్పించి యిచ్చాడు.

రాజారావ్ కాఫీ తాగుతూ - "ఇంట్లో పిల్లా జెల్లా ఎవరూ కనబడరేం మాస్టారు?" - అనడిగాడు. "నాకు పిల్ల లెక్కడున్నారోయ్! మొన్నేగా నా పెళ్ళయింది: పిల్లలిప్పట్నించీ ఎందుకు న్యూసెన్స్!" - అన్నాడు కృష్ణ మూర్తి. ఆ తర్వాత పెళ్ళిళ్ళగురించీ పెళ్ళాలగురించి చిన్న ఉపన్యాసమిచ్చాడు. ఇచ్చి - "నువ్వెప్పుడు చేసుకుంటావోయ్ పెళ్ళి" - అనడిగాడు.

"నేను ఊఁ అనాలేగాని, మా వాళ్ళు ఏ క్షణాన్నయినా చేసేస్తారు. నేనొక్కణ్నే అవటంచేత మా వాళ్ళకి నా పెళ్ళి త్వరగానే చెయ్యాలనుంది. నాకుమాత్రం ఈ ఆర్నెల్లూ ఆగి బియ్యే పూర్తయ్యాక చేసుకుందామని వుంది. అయినా మంచిపిల్ల దొరకాలిగా మాస్టారూ!"- అన్నాడు.

"నువ్వొఠ్ఠి ఫూల్ వి రాజారావ్! లేకపోతే ఆడదానికి మంచేమిటోయ్! ఆడజాతంతా ఒకటే

ఈ ప్రపంచంలో ఏ ఆడదీ మంచిదికాదు, మంచి కావాలని కూర్చుంటే నీ కీజన్మలో పెళ్ళికాదు. మగాడికి కావలసిన అవసరాలు తీర్చడం, పిల్లల్ని కనడం, పెంచి

పెద్ద చెయ్యడం - అంతవరకే ఆకడి చెయ్యాల్సిన పనులు. అంతకుమించి మరేం చెయ్యనివ్వకూడదు కూడాను. ఈ పనులు చెయ్యడానికి ఎవరు బాగా పనికొస్తారూ అనే చూడాలిగాని ఆడదానికి మంచేమిటి, నాన్సెన్స్!"-అన్నాడు కృష్ణమూర్తి.

రాజారావ్ నవ్వి పూరుకున్నాడు. ఆ తర్వాత మరో సారి రాజారావ్ వచ్చినప్పుడు - కాఫీ తెమ్మని పనిమనిషిని పిలిచి, పనిమనిషి ఆవేళ రాలేదని గుర్తొచ్చి పని మను షుల్ని - ముఖ్యంగా ఆడవాళ్లని ఎందుకు నమ్మకూడదో కాస్సేపు చెప్పి - చివరికి-కాఫీ తెమ్మని భార్యనే పిలిచాడు కృష్ణమూర్తి.

కాఫీ తెచ్చిన కృష్ణమూర్తి భార్యని చూడగానే రాజారావుకి తల దిమ్మెత్తిపోయింది.

కాకి ముక్కుకి దొండపండు తగిలించినట్లూ, నల్లటి మబ్బుకి తెల్లటి మెరుపుతీగని ముడిపెట్టినట్టూ అనిపించింది-కృష్ణమూర్తిని అతని భార్యనీ చూస్తే.

బిస్కెట్ల ప్లేటూ కాఫీ కప్పులూ టీపాయ్‌మీద పెట్టి, యింకేమైనా కావాలా అన్నట్టు చూస్తూ నిలబడ్డ భార్యని—"ఇక నువ్వెళ్ళొచ్చు!" - అని కసిరాడు కృష్ణ మూర్తి

ఇంకా తనకి పరిచయం చేస్తాడేమో అనుకున్న

రాజారావు తెల్లబోయాడు. కృష్ణమూర్తి భార్య మాట్లాడకుండా తలొంచుకొని లోపలికెళ్ళిపోయింది

తెల్లబోయి చూస్తున్న రాజారావుని చూస్తూ,- "ఆడవాళ్లకి అలుసివ్వకూడదోయ్

ఏ మాత్రం అలుసిచ్చినా మన నెత్తికెక్కేస్తారు. వాళ్లని ఎక్కడుంచాలో అక్కడే వుంచాలి. క్రూరమృగాన్ని బోనులో పెట్టినట్టు ఆడదాన్ని పెట్టాలి. బోనులో జంతువుకి ఆహారం ఎక్కువ పెడితే మన అదుపులో వుండదు. ఆడదీ అంతే. ఇంట్లోంచి కాలుకదపనిచ్చినా, అవసరాన్ని మించి మాట్లాడనిచ్చినా మనుష్యుల్లో తిరగనిచ్చినా మరింక మాట వినదు వయసులో వున్న ఆడదాన్ని అసలు నమ్మకూడదు. అందుకే మా ఆవిడ విషయంలో నేను చాలా స్ట్రిక్ట్‌గా వుంటాను!" - అన్నాడు కృష్ణమూర్తి.

"దారుణం మాస్టారూ!" - అన్నాడు రాజారావ్. "పెళ్లయితేగాని ఆడదాని సంగతి నీకు తెలీదులే" అన్నాడు కృష్ణమూర్తి.

o o o

ఆ తర్వాత కొన్నిసార్లు రాజారావు వెళ్ళినప్పుడు కృష్ణమూర్తి యింట్లో లేడు. కృష్ణమూర్తి భార్య వుంది. ఆ తర్వాత మరికొన్నిసార్లు కృష్ణమూర్తి యింట్లో లేనప్పుడు- రాజారావు వెళ్ళాడు.

o o o

చివరికి ఒకనాడు పొద్దున్నే వెళ్ళి - "మాస్టారూ! ఎవరయినా ఆడదానికి మొగుడంటేనూ వాడిబుద్ధులంటేనూ యిష్టం పెంచుకుంటేనూ ఏం చెయ్యాలి?" అనడిగాడు రాజా రావు, కృష్ణమూర్తిని.

"తన్ని తగిలెయ్యాలి! అయినా ఆడదానికి యిష్టాయిష్టాలేమిటోయ్! ఆడదానికి తాళికట్టినవాడే దైవం. వాడు ఎలాంటివాడైనా ఏంచేసినా ఇష్టపడాల్సిందే, చచ్చినట్టు పడి వుండాల్సిందే. ఇది ధర్మం ఇది నీతి. ఇది న్యాయం. ఇదే రూలు. అయితే అజ్ఞానంవల్ల, బుద్ధి గడ్డి తిని, ఈ కట్టుబాటు తప్పి, కట్టుకున్నవాడికే ద్రోహం తలపెట్టిన ఆడదాన్ని గుట్టుగా యింట్లోనుంచి పంపేసి, నీదారిన నువ్వు పొమ్మనడమే మొగుడన్నవాడు చెయ్యాల్సిన పని. దారి తప్పిన ఆడదానికి అదేశిక్ష!" అన్నాడు కృష్ణమూర్తి.

"అయితే మీ ఆవిణ్ణి వెంటనే బయటకి పంపించెయ్యండి. నేను పెళ్ళిచేసుకుంటాను!" - అన్నాడు రాజారావ్.

—